# వింత భూకంపం

రెండో పారం తెలుగుమాష్టరులాగా జగత్ప్రఖ్యాత డిటెక్టివు కేయాస్ బల్లమీద కాళ్ళు పెట్టుకుని కుర్చీలో వెల్లికిలా పడుకుని బడేఖాన్ లాగా మినార్ సిగిరెట్టు దమ్ములాగి కప్పుకేసి పొగచిమ్ముతున్నాడు. కేయాస్ "సెకర్టరీ" చెంచి టైపు మెషీన్ వాయిస్తున్నది.

కేయాస్ అసిస్టెంటు భద్రం గొంతుకూచుని గోళ్ళు గిల్లుకుంటున్నాడు.

కేయాస్ ఆఫీసు తీసుకుని ఏడాది అయింది. ఒక్క "క్లయింటు" వచ్చిన పాపాన పోలేదు.

"చెంచీ, టీ!" అన్నాడు కేయాస్. చెంచి మేడమీదినించి కిందికి దూకింది.

"గురో, ఈ డిటెక్సను అచ్చిరావటం లేదు. కూరగాయలంగడి పెట్టుకుందాం" అన్నాడు భద్రం.

చెంచి టీ తీసుకొచ్చి బల్లమీద పెట్టింది. ఎవరోవచ్చి కేయాస్ కెదురుగా కూర్చున్నారు. మిమ్మల్ని ఎవరూ ఎరగరు. అందుచేత ఈకేసు మీరే పట్టాలి. నా పేరు సర్. నా భార్య చచ్చిపోయింది. ఒకరోజు పొద్దున గదిలోకి వెళ్ళి గడియవేసుకుని చావుకేక పెట్టింది. వంట మనిషీ, తోటమనిషీ తలుపు పడగొట్టి లోపలికి వచ్చి చూస్తే చచ్చిపోయి ఉంది. మెడకు మఫ్లర్ బిగించి ఉంది."

"ఎవరి మఫ్లర్?" అన్నాడు కేయాస్. అతని బుర్ర అప్పుడే తిరిగిపోతున్నది.

"నాదే, కాని నాకుఎలిబీ ఉంది. నేను ఇంకోచోటున్నాను."

"భద్రం?"

"గురో?"

"ఎలిబీ అంటే ఏంటి?"

"అదే, గురో అదుంటే అంతకుడనటానికి వీల్లేదు."

"మీకు అదే ఉందా, సర్? తగ్గాం. వంట మనిషి? తోటవాడు?"

"వంట మనిషికి వంటింట్లో ఎలిబీ ఉంది. తోటమనిషికి తోటలో ఎలిబీ ఉంది. అసలు నా భార్య చచ్చిన గదిలో గది తలుపులోపల గడియేసుంది."

"హత్యాశ్చర్యం! వొండ్రుఫుల్!" అన్నాడు కేయాస్ ఆనందంతో చేతులు ఆడిస్తూ. "మీ ఆవిడకి రంకు మొగుళ్లున్నారా?"

కేయాస్‌ను సర్ డొక్కలో తన్ని, "అటువంటిదేమీ లేదండీ!" అన్నాడు విచారంగా.

కేయాస్ బాధగా మొహం పెట్టి, "లేరని ఎట్లా చెప్పగలరూ?" అన్నాడు.

కేయాస్‌ని రెండో డొక్కలో తన్ని "ఉంటే నాకు తెలీకుండా ఉంటుందాండి?" అన్నాడు కంట తడిపెడుతూ.

కేయాస్ కూడా కంట తడిపెడుతూ, "మీ భార్య పేరేమిటన్నారూ?" అని అడిగాడు.

"పద్మావతండి!"

"పద్మావతి వయసెంత!"

సర్ కేయాస్ మెడమీద ఒక్కటిచ్చుకుని, "పద్మావతిగారనండీ! ఆవిడకి సరిగా పాతికండి" అన్నాడు.

"మీరెప్పుడు పెళ్ళి చేసుకున్నారండీ?"

"అయిదేళ్ళయిందండీ?"

"అప్పుడావిడ వయసెంతా?"

"ఇరవై అయిదులో అయిదుపోతే ఇరవయ్యండి!"

"ఓ మీకు లెక్కలు కూడా వచ్చే! పెళ్ళి ఎక్కడయింది?"

"బర్మాలోనండీ!"

"ఓయాస్! మీ కేస్ తీసుకుంటాను, సర్. ఫీజు పారేయించండి."

సర్ చెక్కురాసి చించి ఇచ్చాడు. దానిమీది సున్నాలు చూసి కేయాస్ మూర్ఛపోయాడు. "చెంచీ! ఇది తీసుకుపోయి సిగిరెట్టు కొట్టులో మార్చి నాలుగు పెట్టెలు మినార్ సిగరెట్లు పట్టుకురా! నేను దూర ప్రయాణం వెళుతున్నాను" అన్నాడతను లేస్తూ. చెంచి కిందికి దూకింది.

"ఇంకో విషయం మీరు చెప్పాలి, సార్. మా ఆవిడ చచ్చేముందు గుడ్డల సాయిబొకడు వచ్చి ఏవో బట్టలు చూపించి వెళ్ళాడు, సార్!" అన్నాడు సర్.

"అది కథలో ఇప్పుడు రాదులే. బర్మాలో మీ ఆవిడ బంధువులెవరూ?" అన్నాడు కేయాస్.

"మేనత్త."

సర్ వెళ్ళాక కేయాస్ మినార్ సిగరెట్టు ఘాటుగా ఊపిరితిత్తుల్లోకి పీలుస్తూ; "భద్రం, ప్రయాణం. బెంచీ, నువు టైపు కొడుతూ ఉండు. చిల్లర ఏదీ? ఇందులో పదివేలు నువ్వుంచుకుని మిగతా పదివేలూ ఇట్లా ఇచ్చెయ్యి," అన్నాడు.

"ఎలికాపటరు తీద్దునా. గురో?" అన్నాడు భద్రం.

"తియ్యి" అన్నాడు కేయాస్.

తరవాత కాస్సేపటికి హెలికాప్టర్ రయ్యిన బర్మాకేసి దూసుకుపోతోంది. "ఆ ఆవు పొదుగల్లే ఏంటి, భద్రం?" అని అడిగాడు కేయాస్.

"అది బరమాగాదా, గురో?" అన్నాడు భద్ర్. "అహహహయ్! నీ ఎదాన బండబడ! నిన్ను మాదిగాడు గొయ్య!" అని హెలికాప్టర్ను అదిలిస్తూ.

"మంచి చోటుగా చూసి దింపు!" అన్నాడు కేయాస్.

హెలికాప్టర్ను ఒక చెట్టుకు కట్టేసి ఇద్దరూ హోటలుకు వెళ్ళారు.

"రండి! మీరు వచ్చినందుకు చాలా సంతోషం" అన్నాడు హోటలు మేనేజరు.

"పద్మావతి తెలుసా?" అన్నాడు కేయాస్ సూటిగా చూస్తూ.

"తెలీకం. పదిహేడేళ్ళ అయిదునెల్ల మూడురోజుల క్రితం ఈ హోటలుకు వాళ్ళ నాన్నతో వచ్చిన అమ్మాయేగా?" అన్నాడు మేనేజరు.

"పద్మావతి కొకనాన్న ఉన్నాడనినాకు తెలీదింకా. తప్పుడు క్లూలివ్వకు. పద్మావతి మేనత్త ఎక్కడుంటుంది?"

"మొగలాయీ దర్బారులో ఇరవయ్యో నెంబరిల్లు!"

"థాంక్స్యూ!"

హెలికాప్టర్ రయ్యిన మొదలాయీ దర్బారు ఇరవయ్యో నెంబరుకు దూసుకుపోయింది.

"రండి! మీరు వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. నేను నిజంగా మేనత్తను కాను. వాళ్ళ నాన్న పెంచమని మిడ్లాండ్ బ్యాంకు మీద ఇరవై వేల రూపాయలకు 2 బీ 95468712 02002 చెక్కిచ్చాడు. అందుకని!" అన్నది యాభై ఏళ్ళ యువతి. "అప్పుడు పద్మావతికి అయిదేళ్ళు కాదు. పాతికేళ్ళు. ఇప్పుడు పద్మావతికి యాభై ఏళ్ళు. కులాసాగా ఉందాండీ?"

"చచ్చిపోయింది. ఆవిడ హత్య మీరుగాని చెయ్యలేదుగదా?"

"నాఉ ఎలిబీ ఉందండీ?"

"అది నీకూ ఉందీ!... భద్రం. మిడ్లాండ్ బాంకుకు పోనీ!"

రయ్యిన దూసుకుపోయింది.

"రండి, దయచెయ్యండి. మీరు వచ్చినందుకు చాలా సంతోషం" అన్నాడు బ్యాంకు ఏజెంటు.

"మీకు పద్మావతి తండ్రి తెలుసా?"

"బెంగుళూరు నించి వచ్చినాయనేనా?"

"భద్రం, బెంగుళూరు పోనీ!"

"అహహహహై! నిన్ను మాదిగాడు గొయ్య!" అన్నాడు భద్రం. హెలికోప్టర్ రయ్యిన దూసుకుపోతున్నది.

"ఆ తెల్లగా కనపడేదేంటి, భద్రం."

"అది బెంగుళూరే, గురో!"

"బ్రేకెయ్యి!"

"హోయ్! హోయ్! ఆగశా!"

హెలికోప్టర్ నిలిచిపోయింది. అందులోంచి దూకి కేయాస్ బోర్లాపడి లేచాడు.

"రండా! దయచెయ్యండా! మీ దర్శన దల్లి బహవాద సంతోష" అన్నాడు చెప్పుల ఫాక్టరీ మేనేజరు.

"పద్మావతి తండ్రి – "

"నాకు తెలీదు, సార్. మేస్త్రి –"

కేయాస్ మేస్త్రీ ఇంటికి వెళ్ళాడు. బయటి అరుగుమీద పిల్లవాడికి పాలిచ్చే ముప్పై మూడేళ్ళ మూడుమాసాల మూడురోజుల వయస్సుగల స్త్రీ కేసి మూడు నిమిషాలు కన్నార్పకుండా చూశాడు. లోపలికి వెళ్ళి ఎదురుగా కూర్చున్నాడు.

"పద్మావతి తండ్రి–"

"నాకు తెలీదండి. ఆ పిల్ల మైసూరులో హాస్టల్లో ఉండేది. మా అమ్మాయితో కలిసి ఆడుకునేది."

"మీ అమ్మాయితో ఇప్పుడు మాట్లాడగూడదు ఇంకా చాలా పేజీలు గడవాలి."

కేయాస్ బయటికొచ్చి, "భద్రం, మైసూరు దూసుకుపో!" అన్నాడు.

మైసూరు స్కూలు! ప్రిన్సిపాలు కెదురుగా కూచుని కేయాస్ సిగిరెట్టు ముట్టించి దమ్ము లాగాడు. ప్రిన్సిపాలు సిగిరెట్టు లాగేసి అవతల పారేశాడు.

"సరే అయితే పద్మావతి" అన్నాడు కేయాస్.

"పద్మావతికి జబ్బు చేసినమాట అబద్ధం. కడుపయింది అయిదోనెల. వేసవి కెలవయి రాగానే కనుక్కున్నాం. కడుపు చేసిందెవరని మగ పిల్లల్నందర్నీ అడిగాం. మేంకాదంటే మేం కాదన్నారు. అయితే బెంగుళూరులోనే ఎవరో చేసి ఉండాలనుకున్నాం" అన్నాడు ప్రిన్సిపాల్.

కేయాస్ బుర్ర అయోమయంగా ఉంది. బయటికొచ్చి, "భద్రం, బెంగుళూరు దూసుకుపో!"

"చల్, బేటా!" అంటూ భద్రం హెలికాప్టర్ని అదిలించాడు.

మళ్ళీ మేస్త్రీ ఇల్లు. పాలిచ్చే ఆడమనిషి.

"నీకు పద్మావతి తెలుసా?"

"బాగా తెలుసండీ. ఆడుకునే వాళ్ళం."

"రంకు మొగుళ్ళున్నారా?"

"ఛీ! ఛీ! అటువంటిది కాదండీ. అసలు ప్రేమంటే ఏమిటో తెలీదండీ. ఒకసారి నేనూ పద్మావతీ అట్టా వెళ్ళాం. ఇద్దరు అత్తరు సాయిబులు కనిపించి మమ్మల్ని వాళ్ళ గుడిసెకు తీసికెళ్ళారు. ఏదో తాగటానికిచ్చారు. ఘాటుగా ఉందికాని తాగితే మంచి ఉషారుగా ఉంది. తరవాత మమ్మల్ని వాళ్ళేదో చేశారు. ఆనందంగా ఇంటికొచ్చేశాం."

కేయాస్ మెదడులో దీపారాధన వెలుగుతున్నది. నూనె కెరటాలు మెదడుని అటూ ఇటూ తాకుతున్నాయి.

"భద్రం, మద్రాసు దూసుకుపో!"

హెలికోప్టర్ దిగంగానే కేయాస్ అంతా కలయచూసి, "మళ్ళా సదాప్రసాదంకు వచ్చినట్టున్నామే?" అన్నాడు.

"అవును, గురో!" అన్నాడు భద్రం.

"భద్రం, మనకో కాన్పుల ఆస్పత్రి కావాలి. ఏదో ఒకటి కోరుకో."

భద్రం కళ్ళు మూసుకుని వేలు పెట్టాడు. అక్కడికి వెళ్ళారు.

డాక్టరు మోహాక్షి పక పక నవ్వి, "ఇవాళే ఒకమ్మాయికి పురుడొచ్చింది. మీకు కావాలంటే నాతో రండి" అన్నది.

కేయాస్ ఆత్రుతగా లేచి లోపలికి వెళ్ళాడు.

"నేను బీచిలో ఒకమ్మాయిని చూశాను. ఇద్దరం కాస్సేపు ప్రేమించుకున్నాం. ఇంకా పెళ్ళి కాకుండానే మా ప్రేమకు పురుడు అడ్డుతగిలింది" అన్నాడు కేయాస్.

"పద్మావతి సరిగ్గా ఈ పనే చేసింది. పిల్లవాడు పుట్టాడు. సాయిబు మొహం. పద్మావతి మీద దయదలిచి పిల్లవాణ్ణి ఒక బీడి వర్తకుడికి ఇచ్చేశాను. అంతే పద్మావతి అంతా మరిచిపోయింది" అన్నది డాక్టరు.

"అంతా?" అన్నాడు కేయాస్.

"మొత్తం!"

"హాశ్చర్యం! హత్యాశ్చర్యం!" అంటూ కేయాస్ ఎనిమిది, తొమ్మిది భావాలతో బయటికి నడిచాడు.

డాక్టరుగారూ ఖాళీగా ఉన్నాడు. కేయాస్ ఎదురుగా కూచుని మినార్ అంటించి లాగి వదిలాడు.

"మీకేం రోగం?" అని శ్రద్ధగా అడిగాడు డాక్టరు.

"భూకంపాలను గురించి మీకేం తెలుసు?" అన్నాడు కేయాస్. డాక్టరు చెప్పాడు.

"అబ్బా!" అన్నాడు కేయాస్.

"షాక్!" అన్నాడు డాక్టర్.

"అబ్బా!" అన్నాడు కేయాస్.

"అంతా పోతుంది. పద్మావతి కేమయింది? అంతా పోయింది. మొత్తం! షాక్! మెదడులో భూకంపం! నేను వెళ్ళేప్పటికి గొంగళిపురుగు! వచ్చేప్పటికి అంతలోనే సీతాకోకచిలుక!"

కేయాస్ బయటికి ఉరికాడు. బీడీ వర్తకుడి యింటికి దూసుకుపోయాను. మార్వాడీ సేఠ్ ఉన్నాడు.

"బీడీ వర్తకుడెక్కడ?" అని అడిగాడు కేయాస్.

"సిన్మాథ్యాటర్లో యిచారించి చూడండి!"

సినిమా థియేటర్లో అడిగితే సినిమాతార యిల్లు విచారించమన్నారు.

సినిమాతారకోసం వెళితే చచ్చిపోయి ఉంది.

"గురో, కొత్త కేసు!" అన్నాడు భద్రం.

"ఎవరు మీరు?" అన్నాడు సినిమా తార తండ్రి.

"బీడీ సాయిబులం - కాదు బీడీ వర్తకుడి యిల్లు కావాలి" అన్నాడు కేయాస్.

"ఢిల్లీ!"

"భద్రం, చలో ఢిల్లీ!"

హెలికాప్టర్ రయ్యిన దూసుకుపోయింది.

ఇంపీరియలిస్ట హోటల్.

"అలోవ్!" అన్నాడు కేయాస్ రిసీవరు ఎత్తి.

"అలోవ్!" అన్నది ఆడగొంతు.

"అలోవ్!"

"అది విన్నా! తరవాత చెప్పు!"

"బీడి సాయిబు-"

"ఆస్పత్రిలో."

"థాంక్స్ యూ!"

బీడీసాయిబు మంచంమీద పడుకున్నాడు. కేయాస్ ఎదురుగా కూచుని మీనార్ ముట్టించి దమ్ము ఊపిరి తిత్తుల్లోకి లాగాడు.

"మీరు పెంచుకున్న అబ్బాయి - "

"ఆర్ఫనేజ్ - అంటే అనాధ శిశు శరణాలయం."
కేయాస్ ఆర్ఫనేజ్‌కు దూసుకుపోయి "సెకర్టరీ" ముందు దూకాడు.
"మీరేనా సెకర్టరీ?"
"అవును."
"బీడీసాయిబు పెంపుడు కొడుకు."
"ఇక్కడ లేడు. ఇంజనీరింగ్ కంపెనీ" ఇంజనీరింగ్ కంపెనీ మేనేజరు.
"దావూద్ గోపాల్ తెలుసా?"
"తెలుసు."
"ఉన్నాడా?"
"లేడు. బట్టలషాపు."
బట్టలషాపు మేనేజరు.
"దావూద్ గోపాల్ తెలుసా?"
"తెలుసు."
"ఉన్నాడా?"
"లేడు."
"ఎందుకులేడూ?"
"మూటేసుకుని ఊళ్ళు తిరగబోయాడు."
"వాళ్ళిల్లు?"
మేనేజరు చెప్పాడు.
దావూద్ గోపాలం ఇంట్లోనే ఉన్నాడు.
"నేను డిటెక్టివు కేయాస్‌ను."
దావూద్ గోపాల్ భయపడుతూ, "నేను పద్మావతిని చంపలేదండీ!" అన్నాడు.
"నాకా సంగతి మొదటినించీ తెలుసు. నువేం భయపడకు."
కేయాస్ ఇంటికి తిరిగొచ్చాడు.
"ఇప్పుడంతా తెల్లగా ఉంది!" అన్నాడు బెంచీతో.
బెంచీ పరుగెత్తుకుంటూ వచ్చి ప్రేమ ఆపుకోలేక అతనిమీద పడింది.
"బెంచీ, సర్ నన్ను ట్రంకు చేశాడా?"
"రోజుకు 30 సార్లు చొప్పున 10 రోజులకూ మూడొందల సార్లు చేశాడు."
"వొండ్రుఫుల్! వొండ్రుఫుల్!'
టెలిఫోన్ మూడొందలొకటోసారి మోగింది.

"అలోవ్!"

"ఈకొసని సర్. ఏమయింది?"

"అంతా తెల్లగా అయింది."

"నేను రానా?"

"వొద్దు నేనే వస్తా."

కేయాస్ బట్టలు మార్చుకుని వెళ్ళాడు.

"తోటవాడా?"

"అయ్!"

"ఇప్పుడు చెప్పు, పద్మావతి చావకమునుపు ఏంచేసింది?"

''బట్టల సాయిబు దగ్గిర వదిరూపాయలు బట్టలు కొని, యాభై రూపాయలిచ్చిందయ్!"

"అప్పుడు నువేమన్నావ్? జ్ఞాపకం ఉందా?"

"అయ్! ఈ బట్టలబ్బి సాయిబల్లే ఉన్నాడన్నానై!"

"ఆ మాట అన్నావ్?"

"అయ్!"

కేయాస్ బుర్ర గిర్రున తిరిగింది. సాయిబు! అగ్ని పర్వతం! ఫటాఫట్! కేయాస్ పరిశోధన ముగిసింది!

"ఏమయింది?" అంటూ వచ్చాడు సర్.

"ఏం కాలేదు. పద్మావతి ఆత్మహత్య చేసుకుంది!"

"ఇన్ని రోజులూ తిరిగి ఇదేనా నువు కనుక్కున్నది?"

"ఆయ్ – అంటే నా ఉద్దేశం, అంతేనండి!"

"ఇందుకేనా అంత డబ్బు నీ బొందన పోసింది?" అంటూ సర్ సర్రున తుపాకీ తీసి కేయాస్ గుండెలోకి సూటిగా ఆరుగుల్బు పేల్చాడు.

సరిగా అదే సమయాన బెంచి, కేయాస్ విడిచిన చొక్కాజేబులు పరిశోధన చేస్తున్నది.

***ముద్రణ: తెలుగు స్వతంత్ర, 7 సెప్టెంబర్ 1956***